# గుండె కప్పు

"ఛీ వే గుడిసేటి దానా! మొగుడు సత్తా వుంటే పది రూపాయలు మొకాన కొట్ట లేవేంటే లంజికాన. నిన్నియాల బతకనివ్వను. ముక్కలు ముక్కలు కింద నరికి బోగులెడతాను...!"

"నీజిమ్మడి పోను. నీకేం పోయేకాలం వొచ్చిందిరా సచ్చినోడా. సంపాయించుకుని తాగే వోళ్ళని సూసేను గాని తాగటానికి పెళ్లాన్ని డబ్బులడిగే వోడ్ని ఇదిగో నిన్నే సూత్తన్నా. సిగ్గులేని జలమ...!"

జుట్టు పట్టుకుని గుంజుతూ పిడిగుద్దులు గుద్దుతోంటే అంది రంగి. రెచ్చిపోయాడు అసిరయ్య. మూలనున్న చీపుర కట్టని తిరగేసి కొడుతోంటే బిడ్డని చంక నేసుకుని గుడిసెలోంచి బయటికి పరుగెత్తింది.

అయినా అతడు వదల్లేదు. ఆమెని తిడుతూ తరిమాడు.

"ఇయాల నీకు మూడిందే. సంపేత్తాను" అని వెంట పడుతూ లేస్తూ అతడూ, "ఓర్నాయనో సంపేత్తన్నాడు దేవుడోయ్" అని ఏడుస్తూ ఆమె గుడిసె చుట్టూ తిరగసాగారు.

చుట్టు పక్కలి ఇళ్ళల్లోని వాళ్ళు గబగబా బయటి కొచ్చి చోద్యం చూస్తూ నిలబడ్డారు.

"రోజు రోజుకీ అసిరిగాడి ఆగడాలు ఎక్కువై పోతున్నాయి. రంగి గనుక తిట్టినా కొట్టినా సహిస్తోంది. మరొకళ్ళూ మరొకళ్ళూ అయితే ఎప్పుడో విడాకులిచ్చేద్దురు" సుబ్బాయమ్మ గారి కోడలు నందిని అంది.

"సంసారం మడుగులాంటిదే అమ్మాయ్. అందులోకి దిగేక అక్కడ ఇమళ్ళేం బయటికి రాలేం. మడుగులో జలగలున్నా మొసళ్ళున్నా భరించి వుండమని బ్రహ్మ దేవుడు ఆడవాళ్ళ నుదిట మీద గంటంతో రాసేశాడు" నిట్టూర్చింది ఆ ప్రక్కింటి కామాక్షి.

"ఆడదానికి భూదేవంత సహనం వుండాలి!" సిగరెట్ దమ్ము గట్టిగా పీల్చి అన్నాడు కాంతారావు.

"మొగుడి చేత చావు దెబ్బలు తినడానికా!" పచ్చ మేడింటి వారమ్మాయి నీరజ అంది. ఆమె కాలేజీలో చదువుతోంది. డిబేటింగులో ఫస్ట్ ప్రైయిజ్ ఎప్పుడూ ఆమెదే.

"అది మొగుడూ పెళ్లాల వ్యవహారం. ఇప్పుడు కొట్టుకుంటారు. కాస్సేపయ్యాక వాటేసుకుంటారు. చూసిన చోద్యం చాలు గాని వెళ్ళండెళ్ళండి!" పై పోర్షన్లో వుంటోన్న లలితాంబ అంది.

"మీటింగుకి నేనే లేటైనట్టున్నానే... ఏహోయ్ కాంతారావ్. రొటీన్ గొడవేనా కొత్త ట్విస్ట్ ఏమైనా వుందా" అంటూ వచ్చాడు కోదండం.

"మీరింకా రాలేదేవిటా అనుకుంటున్నాం. అందరిళ్ళ భోగట్టా మొదట మీకే కావాలిగా!" వ్యంగ్యానికి నవ్వు జోడించింది కామాక్షి.

"పక్కింట్లోకి తొంగి చూడటం భలే ఇంట్రస్టింగా వుంటుంది" అన్నాడు కోదండం అదోలా నవ్వుతూ.

"పాడిందే పాడరా పాచిపళ్ళ దాసరీ అన్నట్టు రంగేమో సారాకి డబ్బు లివ్వదు. ఇచ్చే దాకా కొడతాడు వాడు. మరి భరించలేక అయిదో పదో పారేస్తుంది. వాడు సారా కొట్టుకెళ్తాడు. ఇది తిట్టుకుంటూ కూలి పని కెళ్తుంది! సేమ్ ఓల్డ్ స్టోరీ! అది ఇల్లూ వీడు సారా వదులుకోరు!" నిట్టూరుస్తూనే రంగి వంక ఆబగా చూస్తూనే వ్యాఖ్యానించాడు కాంతారావు.

రోజూ మొగుడు చావబాదుతున్నా అతడ్నే అంటిపెట్టుకుని వుంటోంది రంగి. ఎందుకలా పడి వుంటోందో ఎంతాలోచించినా కాంతారావుకి అర్థం కావట్లేదు. అక్కడికీ ఓ సారి 'నిన్ను చక్కగా చూసుకుంటాను. వచ్చెయ్యి' అని సూచాయిగా చెప్పేడు. ఈసడింపుగా చూసింది తప్ప తలూప లేదు!

"పాత కథే అంటూ తొంగి తొంగి చూట్టం ఎందుకూ! ఇంక వెళ్ళండి వెళ్ళండి!" అంది లలితాంబ గొంతు హెచ్చించి.

సీన్లో మార్పు లేకపోయే సరికి ఆశాభంగం పొందుతూ వెనుదిరగబోతోంటే జరిగిందది.

"ఆగు!' చటుక్కున వెనుదిరిగి గుడ్లెర్రజేస్తూ అరిచింది రంగి.

అదిరిపడ్డాడు. తూలి పడబోయే నిలదొక్కుకుని వెర్రిగా చూశాడు అసిరయ్య.

"ఇంకొక్క అడుగు ముందు కేసేవంటే నేనేం జేత్తానో నాకే తెలీదు..." రొప్పుతూ

అంది.

చంకలోని పిల్ల ఒకటే ఏడుపు!

"ఏంటే ఏంటే....." బెదురు దాచుకుంటా ఎగిరాడు.

"నువ్వూ వద్దు నీతో కాపురమూ వద్దు. ఇదిగో నీ పిల్ల ఏం సేసుకుంటావో సేసుకో"

గబుక్కున చంకలోని పిల్లని అతడి కాళ్ళ ముందు పడుకో బెట్టి విసవిసా వెళ్ళిపోయింది రంగి.

అవాక్కయ్యాడు అసిరయ్య.

బుగ్గలు నొక్కుకున్నారు చూస్తోన్న ఆడవాళ్ళు. కళ్ళు నలుపుకున్నారు మగాళ్ళు.

"అది రంగేనా! హవ్వ! ఎంతబరి తెగించిందో చూడు!" కామాక్షమ్మ అంది.

"తెగే దాకా లాగితే అంతే మరి. ఇలా జరుగుద్దని నేనెప్పుడో ఊహించాను" అంది నందిని.

"లేడీ పవర్ చూపించింది. రంగి రియల్లీ గ్రేట్!" మెచ్చుకుంది నీరజ.

"మరీ ఇంత దారుణమా! సంసారాన్ని కాలదన్నుకుని ఎక్కడికి పోద్ది ఏట్లోకి!' అన్నాడు కోదండం.

అతడి కింకా తన కళ్ళు చూసిందాని మీద విశ్వాసం కుదరలేదు.

"కలికాలమండీ... ఎవరికో మరిగి వుంటుంది. ఈ వంకన మిండగాడి దగ్గరకి పోయుంటుంది"

కాంతారావు వంక గొంగళి పురుగును చూసినట్టు చూసింది లలితాంబ "మీ జిమ్మడిపోను, మగ బుద్ధులు పోనిచ్చుకున్నారు కాదు! అసిరిగాడ్ని తప్పు బట్టకుండా రంగిని ఆడిపోసుకుంటారేంటి?!"

"కట్టుకున్నోడు కొట్టినా చంపినా విశ్వాసంగా పడుండాలి తప్ప కట్టు తెంచేసుకుంటే లోకం భ్రష్టు పట్టిపోదూ?!" కోదండం అన్నాడు.

"ఏం పట్టదు మహరాజులా ఉంటుంది. ఊరోళ్ళ ఊసులు తప్ప మీకు పనీపాటా లేవా!"

లలితాంబ మాటలకి అయిష్టంగానే కదిలారంతా.

అసిరయ్య గుక్కపెట్టి ఏడుస్తోన్న ఏడాది కూతురు వంక విసుగ్గా చూశాడు. కోపంగా చూశాడు. ఒళ్ళుమండి కసురుకున్నాడు. తిట్టాడు. ఏడుపు రెట్టింపయ్యింది.

ఏం చేయాలో తోచక బుర్రగోక్కున్నాడు. అసహనంతో కలతిరిగాడు.

"ఈ పిల్ల రాచ్చసిని నా మెడకి తగిలించి పోయింది" అని తిడుతూ, రంగి తిరిగి వస్తోందేమోనని ఆశగా చూసి చూసి విసుక్కున్నాడు. తిట్టాడు. తిట్టుకున్నాడు.

ఇవతల పిల్ల ఏడ్పు. తన లోలోపల 'సరుకు' కోసం నరాల గోల!

ఇంట్లో కెళ్లి గూట్లో పిడతల్లో అన్ని చోట్లా వెదికాడు. డబ్బు కాదుగదా అమ్మదయ్యే సరుకేదీ గుడిసెలో కన్పించలేదు.

పెళ్లాన్ని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టాడు.

ఏడ్చి ఏడ్చి వెక్కిళ్లు పడుతోంది బిడ్డ. పిల్లని ఎత్తుకుని సముదాయించాలని చూశాడు. సాధ్యం కాలేదు. ఏం పట్టించడానికీ గుడిసెలో ఏమీ లేవు. కాసిని నీళ్లు పట్టించగా రెండు గుక్కలు తాగి మళ్లీ ఏడుపందుకుంది.

ఆకలి ఏడుపని అర్థమయ్యింది. "నియ్యమ్మ వుండెహె. నీది పాలగోల. నాది సారా గోస...!" ఉక్రోషంతో అరిచాడు. ఏం చేయాలో తోచటంలేదు.

కాస్సేపు గుంజాటన పడి పిల్లని ఇంట్లో వదిలి బయటికెళ్లిపోయాడు అసిరయ్య.

అది చూసి కామాక్షి నందినిని పిలిచి చెప్పింది.

"పాపిష్టోడు ఎంత పని చేశాడో చూడు! పసిపిల్లని ఇంట్లో వదిలి తాగటానికి పోయాడు!"

ఆవిడ మాటలు పట్టించుకోకుండా "రంగి తిరిగి రాలేదంటారా పిన్ని గారూ?" ఆరా తీసిందామె.

"అదో కఠినాత్మురాలు. కడుపున పుట్టిన కూతుర్ని నట్టేట ముంచి తన సుఖం తను చూసుకుంది. తనకేం వీడు కాకపోతే ఇంకో మొగుడు దొరుకుతాడు. ఆ పిల్లకి తల్లి దొరుకుద్దా చెప్పు?"

"ఏవిటో – మనుషుల్లో నీతి వుండట్లేదు పిన్నిగారూ. అసలిలాటి వాళ్ళని..." అనింకేదో అనబోయే ఎవరో గొంతు నొక్కి పట్టినట్టు ఆగిపోయింది నందిని. పెళ్లి కాక ముందు ప్రేమికుడితో తొందర పడిన క్షణాలు గుర్తొచ్చాయామెకి. మొదట్లో అతడ్నే పెళ్లి

చేసుకోవాలనుకుంది. అతడి వెనుక ఆస్తులు నాస్తి అని తెలిసే సరికి ఆ ఊహలమొగ్గల్ని గిల్లి పారేసింది!

వాళ్లు లోపల కెళ్లారో లేదో కాంతారావు ఇంట్లోంచి వచ్చి రంగి గుడిసె వైపు ఆశగా ఆసక్తిగా చూస్తోంటే కోదండం ప్రత్యక్షమయ్యాడు.

"మనం ఏవిటేవిటో అనుకుంటాం గాని ఈ అలగా జనానికి విలువలుండవు. పూట గడిస్తే చాలు పూటుగా తాగితే చాలనుకుంటారు"

"రంగి నిజంగానే వెళ్లిపోయిందంటారా?"

మిర్రి చూశాడు కోదండం. తడబడ్డాడు కాంతారావు.

"ఇంతదాకా రాలేదంటే ఇక రానట్టే"

కాంతారావు గుండె మూల్గింది. రంగి వెనకే వెళ్ళి వుంటే ఆ వేడిలో ఒప్పుకునేదేమో! ఉంపుడు గత్తెగా మారేదేమో! ప్చ్.....! బంగారం లాంటి ఛాన్స్ ఏ రాబందు తన్నుకుపోయిందో!

"ఏవిటదోలా అయిపోయావ్ కాంతారావ్. ఎనీ ప్రోబ్లం?"

"నాకు ప్రోబ్లం ఏవిటి పూలరంగబ్బీ. ఆ పిల్ల గతి ఏవిటా అని ఆలోచిస్తున్నాను"

"పిల్ల గురించా! ఇంకా తల్లి గురించి ఆలోచిస్తున్నావేమో అనుకున్నాన్లే"

చురుగ్గా చూసి సగం కాల్చిన సిగరెట్టుని విసిరేసి "పనుంది" అంటూ ఇంట్లో కెళ్ళిపోయాడు.

"పిల్ల కాకి! నా ముందా కుప్పిగంతులు?" అనుకుంటూ ఏమీ ఎరగనట్టుగా గుడిసె పక్కకెళ్ళాడు కోదండం.

లోపల్నుంచి పిల్లదాని ఏడ్పు విన్పిస్తోంది. దరిదాపుల్లో రంగి గాని అసిరయ్య గాని కన్పించలేదు. అటూ ఇటూ చూస్తోంటే లలితాంబ మేడ దిగుతూ కన్పించింది. మొఖం చిట్లిస్తూ మెల్లగా అక్కడ్నుంచి జారుకున్నాడు.

అసిరయ్య రంగి కోసం ఊరంతా గాలించాడు. వారినీ వీరినీ అడిగాడు. చూడలేదన్నారంతా. సంగతేవిటని తీగ లాగ బోయారు గానీ ఏవీ లేదనేశాడు. జరిగింది చెప్పడానికి అహం అడ్డొచ్చింది. తన అసమర్థత మీద కోపం, ఉక్రోషం రాసాగాయి. తననీ తిట్టుకున్నాడు. రంగినీ కసిగా తిట్టాడు. పెళ్లాం లేచిపోయిందంటే ఎంత అప్రతిష్ఠ!

బొద్దాడని బుడ్డోడు కూడా గేలిచేస్తాడు!

'ఎంత కర్మొచ్చి పడిందిరా బగమంతుడా!'

కనీసం బిడ్డకు గుక్కెడు పాలైనా పట్టిద్దామని తెలిసిన కాపులిళ్ళ కెళ్ళి అర్ధించాడు.

"పాలు అమ్ముకుని సారా తాగుదామనా! నీ సంగతి మాకు తెలీదూ! వెళ్ళెళ్ళు" అని దులపరించేశారు. అతడెంత బ్రతిమాలినా ఎవరూ నమ్మలేదు.

"తాగుబోతు మాటలు!" అని ఈసడించారు.

ఈ స్థితికి కారణం రంగేనని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టాడు. ఆయాసం వచ్చి రొప్పాడు. బిడ్డ గుర్తొచ్చింది. కలవరపడ్డాడు. పెద్ద పెద్ద అడుగులేసుకుంటూ ఇంటి ముఖం పట్టాడు. గుడిసె తలుపులు తీసి వుండటం అల్లంత దూరాన వుండగానే కన్పించింది. రంగి తిరిగొచ్చిందా లేక కుక్కలు లోపలికెళ్ళి బిడ్డని....ఆపైన ఊహించలేక పరుగు పరుగున వెళ్ళాడు,

లోపలి దృశ్యం చూసి గుమ్మంలోనే ఆగిపోయాడు.

లలితాంబ పిల్లకి గ్లాసుతో పాలు తాగిస్తోంది!

తలొంచుకుని చతికిలబడ్డాడు.

"ఒరె ఒరె నీకెప్పుడు బుద్ధొస్తుందిరా. పిల్ల పొట్టలో ఇన్ని పాలు పొయ్యలేని వాడివి పిల్లనెందుకు కన్నావురా! పెళ్లాం విలువ తెలీనోడివి అసలు పెళ్లెందుకు చేసుకున్నావురా! నువ్వు పీకమొయ్యా తాగటానికి కూల్డబ్బులు తెచ్చిస్తుందనా? నీకు ముప్పొద్దులా తిండే పెడ్తుందా సారాయే పోయిస్తుందా! ఛీ. అసలు నువ్వు మనిషివేనా? చీమూ నెత్తురూ ఉన్నాయా? పసిపిల్లని గాలి కొదిలి ఎగరేసుకుపోతావా! మనిషి పుట్టుక పుట్టగానే సరికాదు మనిషిలా బతకాలి..."

బెల్లం కొట్టిన రాయిలా వుండి పోయాడు.

"ఇదిగో పిల్లని తీసుకో. దీన్నైనా సరిగ్గా చూసుకో. లేకపోతే నలుగురూ ఛూ అని నోట్లో వూస్తారు... పెళ్లామంటే నిన్నూ నీ బిడ్డల్నీ కంటికి రెప్పలా చూసేదని అర్థంరా వెధవా! నీ బుద్ధి మారదు. దాని జాతకమూ మారదు!"

తలొంచుకున్నాడు.

బిడ్డని అందిచ్చి వెళ్లిపోయిందామె.

ఆకలి తీరడంతో ఆదమరచి నిద్ర పోతోంది పిల్ల. పక్క పరిచి పడుకోబెట్టి పక్కనే చతికిల బడ్డాడు అసిరయ్య.

రంగి నీళ్లోసుకుందని తెలిసినప్పుడు రంగీ తనూ ఎంత పొంగి పోయారు! ఎన్ని తీయని ఊహలల్లుకున్నారు!

అలాటిదిప్పుడు బిడ్డని ఆకల్తో మాడ్చి చంపుతున్నాడు. పెళ్లాం బిడ్డలకన్నా తాగుడెక్కువైపోయింది. ఇల్లూ ఒళ్లూ గుల్ల అవుతున్నా ఆ ఊబిలోంచి బయట పడలేకపోతున్నాడు. ఇది వరకు కూలి డబ్బులు చేతిలో పడ్డాక తాగేవాడు. ఇప్పుడు పట్టపగలే పనికెళ్లే ముందే 'గ్లాసు' కోసం వెంపర్లాడుతున్నాడు! సరుకు పడకపోతే సరిగ్గా నిలవలేకపోతున్నాడు!

రంగి..... రంగి నిజంగానే తనని వదిలేసి వెళ్లిపోయిందా? అది తిరిగి రాకపోతే ఊళ్లో తలెత్తుకోలేడు. పిల్లని పెంచలేడు! పొయ్యిలో పిల్లీ లేవదు!

'ఇదెక్కడి సావురా బగమంతుడా!' రంగి విలువ తెలిసొస్తోంటే అనుకున్నాడు.

ఏడుపు పొంగి వచ్చింది. నేల మీద పడి కుళ్ళి కుళ్ళి ఏడ్చాడు. ఏడుస్తూనే నిద్రపోయాడు!

చీకటి పడింది.

కామాక్షి ఇంట్లోంచి వీధిలోకీ వీధిలోంచి ఇంట్లోకీ కాలుగాలిన పిల్లిలా తిరుగుతోంది.

"రంగి తిరిగి రాలేదు కదా ఆంటీ" నీరజ అడిగింది. సస్పెన్స్ భరించలేకుండా వుందామె.

"వూహు రాలేదు. అసిరిగాడి అలికిడీ లేదు. వెదకటానికెళ్ళాడేమో!"

"కన్పించినా రాదులే. ఈ మగాళ్ళకిలాంటి షాక్ ట్రీట్‌మెంట్ ఇవ్వాల్సిందే"

"ట్రీట్‌మెంట్ ఎవరికీ" అంటూ వచ్చింది నందిని. ఆమె చూపులు మాత్రం రంగి గుడిసెని తడుముతున్నాయి.

"రంగి తిరిగి రాలేదు తెలుసా?" అంది రహస్యంగా కామాక్షి.

"నో డౌట్. ఎవర్నో తగులుకునుంటుంది. ఇద్దరు ముగ్గురు కుర్రాళ్ళు గుడిసె చుట్టూ తిరగటం చూశాను" అంది నందిని.

"అలాటి వాళ్ళని మన్లాంటి గౌరవనీయ కుటుంబాల మధ్య వుండనివ్వకూడదు. ఊరవతలకి తరిమెయ్యాలి" అంటూ రంగ ప్రవేశం చేశాడు కోదండం.

"నా ఓటు మీకే" అన్నాడు సిగరెట్ వెలిగిస్తూ కాంతారావు.

"పల్లెటూళ్ళలో కూడా ఇలా అంతా రాచుకు పూచుకు తిరగటం పక్కపక్కనే కాపురముండటం ఏవిటో నా కర్థం కావట్లేదు!"

నందిని మాటలకి లలితాంబ జవాబిచ్చింది "పట్నపు పిల్లవి కదా. నీకర్థం కాదులే. ఇక్కడ రైతులూ కూలీలు కలిసే వుంటారు. చేలో దిగి కలిసి పని చేస్తారు. బోదె గట్టునే కూర్చుని భోంచేస్తారు!"

"నాకు తెలీదు లెండి!" మూతి విరుస్తూ వెటకారంగా అనేసి వెళ్ళిపోయింది.

"మీరేదో అనుకుంటున్నారు గాని ఆ రంగి అంత మంచిది కాదు..." అనింకేదో కాంతారావు చెప్పబోతే, "మీరు మంచి వారా? గుండెల మీద చేతులేసుకుని చెప్పండి" అని సూటిగా ప్రశ్నించిందామె.

అతడి గొంతుకలో పచ్చి వెలక్కాయ అడ్డు పడగా ఒక్కడుగు వెనక్కేశాడు.

కోదండం ముందు కొచ్చాడు "రంగి లాంటి ఆడవాళ్ళని మీరు వేసకేసుకు రావడం ఏం బావోలేదు. భర్త బిడ్డ అంటే లక్ష్యం లేని ఆడవాళ్ళని నడివీధిలో నిలబెట్టి....."

"ఏం చెయ్యాలంటారు? దానికన్నా ముందు మిమ్మల్నేం చెయ్యాలో చెప్పండి?"

"మమ్మల్నా? మేమేం తప్పు చేశాం?"

"ఏమీ చెయ్య లేదు గనుక! చంటి బిడ్డ గుక్క పెట్టి ఏడుస్తోంటే గొంతులో గుక్కెడు పాలు పోయడానికి చేతులు రావు గాని ఆడిపోసుకోడానికి నోరు మాత్రం వస్తుంది! వెక్కిరించే నోరు కన్నా సాయపడే చేతులే గొప్ప, తెలుసుకోండి!"

గతుక్కుమన్నారు. తప్పించుకునే వంకకోసం చూస్తోంటే రంగి వస్తూ కన్పించింది. ఇంతింత కళ్ళు చేసుకుని చూశారు.

తిన్నగా గుడిసెలో కెళ్ళి బిడ్డని ఒళ్ళోకి తీసుకుని పాలిస్తూ బిడ్డ తల నిమురుతోంటే అపనమ్మకంగా చూశాడు అసిరయ్య.

"ఇందా" మురిపెంగా నవ్వుతూ అయిదు నోటిచ్చింది. "కోత పని కెళ్ళాను"

సిగ్గుతో చితికి పోయాడు.

"వద్దులేవే. మన పిల్ల మీదొట్టు. ఇంక తాగను" ఆమె నడుం చుట్టూ చేతులేసి చుట్టేస్తూ అన్నాడు. మొఖాన్ని చూపలేక ఆమె సందిట్లో దాచుకున్నాడు.

మురిసి పోయింది రంగి. కళ్ళల్లో కన్నీటి పొర కదిలింది.

ఆమె గుండె కప్పు కింద ఒడిగిపోయారు మొగుడూ కూతురూ!

(నవ్య వారపత్రిక 4.7.2012)